క్లుప్తంగా

నవోదయ పరీక్షకు 255 మంది హాజరు

చింతలపూడి: స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో 2022-23 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి అడ్మిషన్ కోసం నిర్వహించిన నవోదయ ఎంట్రన్స్ పరీక్షకు శనివారం 255 మంది విద్యార్థులు హాజరైనట్టు పరీక్ష చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణ తెలిపారు. అర్బన్, రూరల్ కలిపి 308 మంది విద్యార్థులను చింతలపూడి సెంటర్‌కు కేటాయించామన్నారు. వీరిలో ఇంగ్లీష్ మీడియంలో 138 మంది, తెలుగు మీడియంలో 117 మంది పరీక్ష రాశారని తెలిపారు. కార్యక్రమంలో సీఎల్ఓ పి.మహేష్, డీసీఎల్ఓ శ్రీధర్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నవోదయ ఎంట్రన్స్ ఎగ్జామ్ శనివారం నిర్వహించారు. ఈ పరీక్షకు 269 మందికి 221 మంది హాజరైనట్టు ఎంఈఓ బి.రాముడు తెలిపారు. బాలురు 143 మందికి 120 మంది, బాలికలు 126 మందికి 101 మంది హాజరైనట్టు చెప్పారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.2.01 లక్షల విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు శనివారం రూ.2,01,116 విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన పి.గణపతి రూ.1 లక్ష, కైకలూరుకు చెందిన కొత్తపల్లి నాగదార లక్ష్మీతేజ రూ.1,01,116 జమచేశారు. దాతలకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాలను అందించి, స్వామివారి దర్శనం కల్పించారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న లక్ష్మి

జంగారెడ్డిగూడెం: స్థానిక 11వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి శంకుస్థాపన చేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు జీజీఎం నిధులు రూ.16 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు ఆమె తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జంగారెడ్డిగూడెం పట్టణంలో సుమారు రూ.7 కోట్లకు పైబడి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. వైస్‌చైర్మన్ ముప్పిడి అంజి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు పీపీఎస్ చంద్రరావు, కౌన్సిలర్ ఉగ్గం దుర్గాప్రసాద్, నాయకులు బత్తిన చిన్న, గెద్దాడ శ్రీనివాసరావు, గూడపాటి రాధాకృష్ణ, ఏఈ సంధ్య పాల్గొన్నారు.

దిశ మెంబర్‌గా పూర్ణిమ

చింతలపూడి: జిల్లా డెవలప్‌మెంట్ కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (దిశ) సభ్యురాలిగా చింతలపూడి మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన అగ్నిపర్తి పూర్ణిమ నియమితులయ్యారు. ఈ మేరకు ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు సిఫార్సు మేరకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేసినట్టు ఆమె శనివారం పేర్కొన్నారు. ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబుకు పూర్ణిమ కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవారి క్షేత్రం.. భక్తజన సంద్రం

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పాటు, విద్యార్థులకు పరీక్షలు ముగిసి సెలవులు మొదలవడంతో వేలాదిగా భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తులతో ఆలయ పరిసరాలు కళకళలాడాయి. క్షేత్రంలో సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

కిడ్నాప్ కేసులో వ్యక్తికి రిమాండ్

కొయ్యలగూడెం: పరింపూడి గ్రామంలో బాలికను కిడ్నాప్ చేసిన కేసులో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విష్ణువర్ధన్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పరింపూడికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన పూజారి నాగ వెంకటేష్ అనే వ్యక్తి మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేశాడన్నారు. పెళ్లి చేసుకుంటాడని నమ్మించి, అత్యాచార యత్నానికి పాల్పడటంతో బాలిక ఫిర్యాదు చేసిందన్నారు. దీంతో నాగవెంకటేష్‌పై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కలప పట్టివేత

బుట్టాయగూడెం: రెడ్డిగణపవరం పరిసర అటవీ ప్రాంతంలో నరికిన కలపను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఫారెస్ట్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. సంబంధిత అధికారులకు ట్రాక్టర్‌ను అప్పగించారు. ట్రాక్టర్‌ను అటవీశాఖ కార్యాలయానికి కాకుండా రెడ్డిగణపవరంలోని ఒక రైతుకు సంబంధించిన ప్రదేశంలో ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది. అయితే గత నాలుగు నెలలుగా ఫారెస్ట్ శాఖ వారే కలప అక్రమ రవాణా జరుగుతుంటే చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్క్వాడ్ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు ఈ ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పలువురు చెబుతున్నారు.

దుష్ప్రచారంపై కేసు

ద్వారకాతిరుమల: వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బొండాడ వెంకన్నబాబు దళిత ద్రోహి అంటూ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన ఇద్దరు వ్యక్తులపై శనివారం రాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఒక స్థల వివాదానికి సంబంధించి దూబచర్లకు చెందిన మాండ్రు ప్రసాద్, మాండ్రు పవన్‌తేజలు సోషల్ మీడియాలో వెంకన్నబాబుకు వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నట్టు చెప్పారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రసాద్, పవన్‌తేజలపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

సంక్షేమ ప్రభుత్వ పనితీరుపై ప్రజల సంతృప్తి

- ఎమ్మెల్యే బాలరాజు
- ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా



మా నమ్మకం నువ్వే జగన్ ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు



జంగారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎలీజా

కొయ్యలగూడెం: వైఎస్సార్‌సీపీ సంక్షేమ ప్రభుత్వ పనితీరుపై 80 శాతం ప్రజలు సంతృప్తితో ఉన్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. శనివారం సచివాలయాల మండల కోఆర్డినేటర్ నూకల రాము ఆధ్వర్యంలో కన్నాపురంలో ఉప్పలకృష్ణ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై 22 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా కోటీ 42 లక్షల కుటుంబాల అభిప్రాయాలను సేకరించగా, మళ్లీ జగనన్న ప్రభుత్వమే రావాలని, ఈ దఫా 175 సీట్లు గెలుచుకోవాలని వారంతా భావిస్తున్నారని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలు గెలుచుకున్న నియోజకవర్గాల్లోనూ ప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పనితీరుపై పూర్తి విశ్వాసంతో ఉన్నట్టు తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీకి వెన్నుముకగా నిలిచే కార్యకర్తలు మళ్లీ జగనన్న ప్రభుత్వ ఏర్పాటుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని పిలుపునిచ్చారు. కన్నాపురం గ్రామ కన్వీనర్‌గా కాటుబోయిన సురేష్ పేరును ప్రతిపాదిస్తూ గ్రామ కమిటీ ఇచ్చిన లెటర్‌ను ఎమ్మెల్యే జిల్లా అధ్యక్షుని ఆమోదానికి పంపించారు.

రజనీకాంత్ వ్యాఖ్యలు దురదృష్టం

మాజీ సీఎం ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలకు హాజరైన దక్షిణాది చలనచిత్ర నటుడు రజనీకాంత్ చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమైనవని బాలరాజు పేర్కొన్నారు. ఎన్టీఆర్ మృతికి ప్రధాన కారకుడైన చంద్రబాబు నాయుడుని ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో కీర్తించడంతో ఎన్టీఆర్ ఆత్మ క్షోభిస్తుందని చెప్పారు. 14 సంవత్సరాల చంద్రబాబు పాలనలో ఎన్టీఆర్ పేరిట ఏ పథకమైన కార్యక్రమమైనా ప్రారంభించారా అనే సంగతి రజనీకాంత్ తెలుసుకోవాలని సూచించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్టీఆర్ పేరును ఒక జిల్లాకు పెట్టి చిత్తశుద్ధి చాటిందని వివరించారు. హైదరాబాద్ అభివృద్ధి అనేది ఏ ఒక్కరి వల్ల సాధించింది కాదని, సమష్టి కృషి అని చెప్పారు. అభివృద్ధి వికేంద్రీకరణ తోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమనేది నమ్మాము, దానినే ఆచరింప చేస్తామని బాలరాజు పేర్కొన్నారు. జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, సర్పంచ్ ఉప్పల పద్మావతి, పార్టీ నాయకులు ఉప్పల కృష్ణ, డాక్టర్ శ్రీను, పార్టీ మండల యూత్ ప్రెసిడెంట్ యడ్లపల్లి సురేష్, యర్రగొర్ల వెంకటరమణ, సొంగా రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి విశేష స్పందన

జంగారెడ్డిగూడెం: జగనన్నే మా భవిష్యత్ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ శనివారంతో ముగిసిన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు తీరును నేరుగా ప్రజల ఇళ్లకు వెళ్లి పరిశీలించామన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజాభిప్రాయ సేకరణ చేశామన్నారు. 1.12 లక్షల కుటుంబాల్లో 66,281 మిస్డ్ కాల్స్ వచ్చినట్టు చెప్పారు. పార్టీలకతీతంగా ప్రజలకు మేలు జరిగిందని, ప్రజా మద్దతు పుస్తకాల ద్వారా తెలుపుతూ మళ్లీ మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా రావాలని కోరుకుంటున్నారని వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి మ్యానిఫెస్టోలో పెట్టినవి ప్రతి హామీని అమలు చేశారని తెలిపారు. 31 లక్షల మంది మహిళలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత జగన్‌ది అన్నారు. 2014లో టీడీపీ విడుదల చేసిన మ్యానిఫెస్టో వెబ్‌సైట్ నుంచి తీసేసిందని, టీడీపీ నాయకులు ఏమి చేశారని సెల్ఫీలు తీసుకుంటున్నారనీ ఎద్దేవా చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుని చనిపోగా, ఆమె మృతదేహాన్ని ఫ్రీజర్‌లో పెట్టినప్పుడు గీరుకుందని డాక్టర్లు చెప్పారని వెల్లడించారు. ప్రతిపక్షాలు ఆ మృతదేహాన్ని ఎలుకలు కొరికినట్టు శవ రాజకీయాలకు చేయొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, ఎంపీపీ కొదమ జ్యోతి, చింతలపూడి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, పామర్రు నియోజకవర్గ పరిశీలకులు మండవల్లి విజయ సారథి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ రీజియన్ చైర్‌పర్సన్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వందనపు సాయి బాల పద్మ, పట్టణ అధ్యక్షులు పీపీఎస్ చంద్రరావు, మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, జిల్లా యూత్ అధ్యక్షులు పడమటి గిరిబాబు గౌడ్, కామవరపుకోట మండల కమిటీ అధ్యక్షుడు మిడతా రమేష్, మండల, పట్టణ సచివాలయాల కన్వీనర్‌లు గురజాల పార్థ సారథి, చలమల శ్రీనివాస్, బత్తిన చిన్న, వందనపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగన్ విజయవంతం

బుట్టాయగూడెం: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం విజయవంతమైందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జగనన్నే మా భవిష్యత్ ముగింపు కార్యక్రమంపై వారు విలేకర్లతో మాట్లాడారు. జగన్ నాయకత్వంపై రాష్ట్ర ప్రజలు పూర్తి సంతోషంగా ఉన్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి గెలిపించుకునేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, మండల సచివాలయాల కన్వీనర్ తెల్లం సింహాచలం, నాయకులు కొవ్వాసి నారాయణ, సర్పంచ్‌లు పొడియం లక్ష్మి, తెల్లం వెంకట లక్ష్మి, రవ్వా చంద్రకళ, కుంజా దుర్గమ్మ, పెడకం విజయలక్ష్మి, కుంజా వెంకటేశ్వరరావు, బన్నే బుచ్చిరాజు, మాల్చి వెంకన్నబాబు, ఉయికే బొజ్జి, జోడే సత్యదుర్గా ప్రసాద్, ఎంపీటీసీలు గాలి దుర్గారావు, కొవ్వాసి వరలక్ష్మి, మొడియం వెంకమ్మ, తెల్లం జయమ్మ, నాయకులు యాండ్ర రవి, తెల్లం దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ప్రజలకు సంతోషం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని ఎంపీపీ కోర్సా పోచమ్మ, మండల సచివాలయాల కన్వీనర్ వనమా రామకృష్ణ అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ ముగింపు కార్యక్రమం జీలుగుమిల్లి మండలం ములగలంపల్లిలో సొసైటీ అధ్యక్షుడు గంటసాల గాంధీ ఇంటి వద్ద ఏర్పాటు చేశారు. జీలుగుమిల్లి మండలంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం విజయవంతమైందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్నవారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లం వసంతరావు, వైస్ ఎంపీపీ సోమగాని శ్రీనివాసరావు, ఎంపీటీసీ మొడియం వెంకటలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు బోదా శ్రీనివాస రెడ్డి, నాయకులు చందా ప్రసాద్, చిట్టిబొమ్మ శ్రీను, గంగిరెడ్ల సత్యనారాయణ, మొడియం నాగేశ్వరరావు, గండ్రాల రాంబాబు, త్రిమూర్తులు ఉప్పల రాంపండు, భయ్యా వెంకట్రావు, బాషా, గోపిన రాము, గంగుల రమేష్, కుంజా చిన్నరాముడు, వంకా రామకృష్ణ, సామిల్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో..

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని చల్లవారిగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో శనివారం జగనన్నే మా నమ్మకం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు బద్దే ప్రేమ్ కుమార్ నేతృత్వంలో పార్టీ శ్రేణులు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పేదల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని ప్రేమ్‌కుమార్ తెలిపారు. నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటా లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పెరుమాళ్ల నరసింహరావు, విజయ్‌బాబు, రమణయ్య, సత్తిబాబు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

టి.నరసాపురంలో..

టి.నరసాపురం: జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం విజయవంతమైందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీనురాజు అన్నారు. టి.నరసాపురంలో సహకార సంఘ చైర్మన్ దేవరపల్లి ముత్తయ్య నివాసంలో శనివారం ఏర్పాటుచేసిన ముగింపు సమావేశంలో శ్రీనురాజు మాట్లాడారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ద్వారా వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కానున్నారని స్పష్టమైందన్నారు. కార్యక్రమంలో సహకార సంఘ చైర్మన్ దేవరపల్లి ముత్తయ్య, సర్పంచ్ సునంద, జేసీఎస్ కన్వీనర్ సాయితేజ, ఎంపీటీసీ సభ్యుడు బండి సుబ్బారావు, రాంబాబు, నాయకులు కన్నం సర్వేశ్వరరావు, కటకం మల్లికార్జునరావు, దేవరపల్లి సీతారామ్ ప్రసాద్, యలమర్తి పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

85 శాతం మద్దతు వైఎస్సార్‌సీపీకే



కుక్కునూరులో నిర్వహిస్తున్న ముగింపు సమావేశం

కుక్కునూరు: మండలంలో ప్రభుత్వ పనితీరు మెచ్చి 85 శాతం ప్రజలు వైఎస్సార్‌సీపీకి మద్దతుగా మిస్డ్ కాల్ ఇచ్చినట్టు మండల సచివాలయ కన్వీనర్ ఆవుల బాలకృష్ణారెడ్డి తెలిపారు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ముగింపు సందర్భంగా శనివారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొచ్చర్లపాటి నరసింహరాజు ఆధ్వర్యంలో విలేకర్లతో మాట్లాడారు. జగనన్న పాలనను మెచ్చి ఒక కోటీ 10 లక్షల కుటుంబాలు మిస్డ్ కాల్ ద్వారా మద్దతు తెలిపారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రావు వినోద్, కొచ్చర్లపాటి కృష్ణంరాజు, కుచ్చర్లపాటి చిన్న నరసింహారాజు, అయితా కోటేశ్వరరావు, రాయి సత్యనారాయణ, బట్టు వీరబాబు, మల్లెల చంటి నాయుడు, సూర్ల రాము, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

14న హనుమాన్ భక్తుల బైక్ ర్యాలీ

జంగారెడ్డిగూడెం రూరల్: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మే 14న ఆదివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భక్తులతో మెటారు సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నట్టు వీహెచ్‌పీ సభ్యులు కేవీఆర్ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమ వాల్ స్టిక్కర్‌ను గురవాయిగూడెం మద్ది క్షేత్రంలో ఈఓ ఆకుల కొండలరావు విడుదల చేశారు. మద్దిక్షేత్రం నుంచి జంగారెడ్డిగూడెం పురవీధుల మీదుగా కొత్తపేట అభయాంజనేయస్వామి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్టు సత్యనారాయణ తెలిపారు. భక్తులంతా ర్యాలీలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం చల్లవారిగూడెంలో పునరావాస కాలనీలో ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్య శనివారం పర్యటించారు. నిర్వాసితుల కోసం నిర్మిస్తోన్న గృహాలను పరిశీలించారు. ఆర్‌అండ్‌ఆర్ పరిహారం చెల్లించాలని, ఉపాధి చూపాలని, అంగన్‌వాడీ కేంద్రాలు, వీధిలైట్లు, చేతిపంపులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని, మంచినీటి సౌకర్యం సక్రమంగా లేదని చెప్పారు. ఈ సమస్యలు పరిష్కరించాలని ఆ శాఖాధికారులకు ప్రవీణ్ ఆదిత్య ఆదేశాలిచ్చారు. వేలేరుపాడు ఎంపీపీ వల్ల లక్ష్మీ దేవి, వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు బద్దే ప్రేమ్‌కుమార్, కాలనీ అధ్యక్షుడు గిళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా పథకాల అమలు



రేచర్లలో మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా



కన్నాపురంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

- ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా
- రేచర్లలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

చింతలపూడి: రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్టు ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. రేచర్ల గ్రామంలో శనివారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతర్గత రహదారులను అభివృద్ధి చేయాలని, పక్కా డ్రెయిన్లు, సీసీ రోడ్లు నిర్మించాలని ప్రజలు కోరారు. వీటిపై ఎమ్మెల్యే ఎలీజా స్పందిస్తూ ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన గడపగడపకు కార్యక్రమం దోహదం చేస్తోందన్నారు. నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా చేకూర్చిన ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తున్నామని చెప్పారు. ప్రజలు తమను ఆదరించి నూటికి నూరుమార్కులు వేస్తున్నారని చెప్పారు. పేదలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం నవరాత్న పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎమ్మెల్యే సతీమణి ఝాన్సీరాణి, ఎంపీపీ బి.రాంబాబు నాయక్, సర్పంచ్ కె.శివరామకృష్ణ, ఉపసర్పంచ్ బాలకృష్ణ, పార్టీ నాయకులు తుమ్మూరి వెంకట్రామిరెడ్డి, మాగంటి లక్ష్మణ్‌దాస్, నరుకుళ్ల సుబ్బారావు, గుత్తా మాధవరావు, అడపా సురేష్, త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, కె.యువరాజు, సీహెచ్ జ్ఞానారెడ్డి, చుండూరి నాగేశ్వరరావు, అలవాల బాబు, సాదరబోయిన వరలక్ష్మి, యడ్ల మోహన్‌రావు, ఎం.ఇమ్మానియేలు, ఎం.దిలీప్, ఎస్ కాంతారావు, ఎన్ దుర్గారావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుతో ప్రజల మన్ననలు

కొయ్యలగూడెం: మండలంలోని కన్నాపురంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు నిర్వహించారు. ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తోన్న సంక్షేమాన్ని వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో హామీలు ఇవ్వడమే కాకుండా వాటిని పూర్తి స్థాయిలో నెరవేర్చి ప్రజలు మన్ననలు పొందిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని బాలరాజు వివరించారు. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా జగన్ పాలన వచ్చే ఎన్నికల్లో సైతం విజయాన్ని చేకూర్చుతుందని, 175 సీట్లు సాధించి కొత్త చరిత్ర సృష్టించనుందని చెప్పారు. కార్యక్రమంలో నండూరి వీరబాబు, వల్లూరి పద్మావతి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

జంగారెడ్డిగూడెం: స్థానిక ఇందిరా నాగర్ కాలనీలో వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శనివారం చలివేంద్రాన్ని ఎస్సై ఎం.సాగర్‌బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో వలవల తాతాజీ, నంబూరి రాజు, పీసుపాటి రామలక్ష్మి, చింతల నాని, ధనకుమార్, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీశ్రీ జయంతి

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు జయంతి ఘనంగా నిర్వహించారు. శ్రీ శ్రీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవీంద్రబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వర్షానికి తడిసిన ధాన్యం



ధాన్యంపై బరకం కప్పుతున్న రైతులు

జంగారెడ్డిగూడెం రూరల్: శనివారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసింది. పంగిడిగూడెం, లక్కవరం, తదితర గ్రామాల్లో కళ్లాల్లో ఉన్న ధాన్యం, బస్తాలు తడిసిపోయాయి. నష్టం అంచనా వేస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి పోశారావు తెలిపారు. కళ్లాల్లో ఉన్న ధాన్యం బస్తాలపై రైతులు టార్పాలిన్లు కప్పుకున్నారు.

రేచర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



రేచర్ల ఆర్బీకేలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి: ధాన్యం రైతులకు మద్దతు ధర నేరుగా అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా తెలిపారు. మండలంలోని రేచర్ల ఆర్బీకేలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. మద్దతు ధర కల్పిస్తూ, రైతు అక్కౌంట్‌కే నేరుగా నగదు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎలీజా చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సాంకేతిక సలహాలు అందించడం, విత్తనాల నుంచి పంటకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయడం వరకు ప్రభుత్వమే నిర్వహిస్తోందని వివరించారు. దళారీ వ్యవస్థను నిర్మూలించేందుకు రైతులు కూడా సహకారం అందించాలని కోరారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఏడాదికి 13,500 పెట్టుబడి క్రింద అందిస్తుందని చెప్పారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపీపీ బాణావతు రాంబాబు నాయక్, సర్పంచ్ కె.శివరామకృష్ణ, సొసైటీల అధ్యక్షులు త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, చుండూరి నాగేశ్వరరావు, అలవాల బాబు, సీహెచ్ జ్ఞానారెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ఎస్ వరలక్ష్మి, ఏఓ మీనాకుమారి, గుత్తా/మాధవరావు, మాగంటి లక్ష్మణదాసు, నరుకుళ్ల సుబ్బారావు, గుత్తా మాధవరావు పాల్గొన్నారు.

కలశ పూజోత్సవం

కొయ్యలగూడెం: వాసవి మాత జయంతిని పురస్కరించుకొని స్థానిక త్రిశక్తి పీఠంలో శనివారం ఉదయం 102 మంది కన్యలచే కలశ పూజోత్సవం చేశారు. అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమార్చనలు, శాంతి హోమం, పూర్ణాహుతి, మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలక కమిటీ పేర్కొంది. కొయ్యలగూడెం, బయ్యన్నగూడెం, యర్రంపేట, గవరవరం, చొప్పరామన్నగూడెం, దిప్పకాయలపాడు గ్రామాల్లోని ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

పారిజాతగిరిలో పూజలు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులు మొక్కుబడులు తీర్చుకున్నారు.

సెలవుల్లో 'చదవడం మాకిష్టం'

కొయ్యలగూడెం: విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడానికి విద్యాశాఖ చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఎంఈఓ జె.సురేష్ బాబు శనివారం పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆయన కుంతలగూడెం పాఠశాలలో ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు రాయపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో మూడో తరగతి నుంచి ఎనిమిదో తరగతి బాలబాలికలకు ఐదు చొప్పున గ్రంథాలయ పుస్తకాలను అందజేశారు.

జ్వరంతో గిరిజన విద్యార్థి మృతి

వేలేరుపాడు: మండలంలోని సుద్దగుంపుకు చెందిన పదో తరగతి విద్యార్థి పాయం వెంకన్నబాబు (15) శుక్రవారం రాత్రి జ్వరంతో మృతి చెందాడు. ఆమె కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జీలుగుమిల్లి మండలం బర్రెంకలపాడు గురుకుల పాఠశాలలో వెంకన్నబాబు జ్వరంతోనే పదో తరగతి పరీక్షలు రాశాడు. పాఠశాలలో రోజూ జ్వరం వస్తుండటంతో మాత్రలు వేసుకొని పరీక్షలకు హాజరయ్యాడు. పరీక్షలు ముగిశాక సుద్దగుంపుకు వచ్చాడు. గత ఐదు రోజుల క్రితం మిర్చి కోత కూలికి వెళ్లాడు. అక్కడే కళ్లు తిరిగిపడిపోవడంతో తోటికూలీలు ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం ఓ ప్రైవేటు వైద్యుని వద్దకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందాడు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

జంగారెడ్డిగూడెం: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్సై సాగర్‌బాబు తెలిపారు. తిరుమలాపురానికి చెందిన ఉజ్జినేని వెంకయ్య మానసిక స్థితి సరిగా లేక శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడని, ఊటుకూరి వెంకట సత్య శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జడ్జి వరలక్ష్మికి వీడ్కోలు

జంగారెడ్డిగూడెం: నెల్లూరు జిల్లా కావలి సివిల్ జడ్జిగా బదిలీపై వెళుతోన్న స్థానిక జూనియర్ సివిల్ జడ్జి ఆర్.వరలక్ష్మికి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీడ్కోలు పలికారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు అధ్యక్షతన సభ ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిథిగా కొవ్వూరు సివిల్ జడ్జి ధర్మారావు హాజరయ్యారు. తల్లాడి అశోక్ కుమార్, భువనేశ్వరి, తామా రఘురామ్, విత్తనాల రత్నరాజు, లతాకుమారి, న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యకు ప్రాధాన్యత

పోలవరం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం మండలం కొండ్రుకోట పునరావాస కేంద్రంలోని ఎంపీయూపీ పాఠశాలలో శనివారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. మండల ఉపాధ్యక్షుడు ఎం.సింగరాజు, హెచ్ఎం లక్ష్మణరావు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పోలవరం డివిజన్

9951602915 (పోలవరం)

9505508399 (చింతలపూడి)

Office mail : tpgadvt@gmail.com